## డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం

-టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు సతీమణి రమాదేవి



ప్రచారం నిర్వహిస్తున్న అమిలినేని కుటుంబసభ్యులు, టిడిపి నాయకులు

**కళ్యాణదుర్గం, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి :**

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పట్టణంలో అపరిశుభ్రత రాజ్యమేలుతోందని, టిడిపి అధికారంలోకి రాగానే తన భర్త అమిలినేని సురేంద్రబాబు సహకారంతో పట్టణంలో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అభ్యర్థి సురేంద్రబాబు సతీమణి రమాదేవి భరోసా ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని 16వ వార్డులో అమె కోడలు ఇషిత, అమిలినేని సోదరి రాధమాధవి,తెలుగుమహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి వాల్మికి ప్రియాంకలతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని డ్రైనేజీలపై ప్రజలు ఫిర్యాదు చేయడంతో అమె స్పందిస్తూ అధికారంలోకి వచ్చాక సమస్యలను పరిష్కరిస్తామన్నారు.ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ టిడిపి ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోయే సూపర్ సిక్స్ మానిఫెస్టో పథకాలు మహిళలకు కలిగే ప్రయోజనాలను వివరించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనరు శర్మస్‌వలితో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా ఎరడికెర శ్రీతిప్పేరుద్రస్వామి రథోత్సవం

బ్రహ్మసముద్రం మార్చి 26 ప్రభాతవార్త,



శ్రీ తిప్పేరుద్రస్వామి రథోత్సవం

మండంలోని ఎరడికెరలో శ్రీ తిప్పేరుద్రస్వామి రతోత్సవం కన్నుల పండుగగా జరిగింది ప్రతి సంవత్సరం చెళ్ళికెర తాలూకా నాయకనహట్టి శ్రీ తిప్పేరుద్రస్వామి రతోత్సవం జరిగిన తరువాత ఎరడికెరలో రతోత్సవం నిర్వహిస్తారు. శ్రీ తిప్పేరుద్రస్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన తరువాత గ్రామ వీధులలో పూల పల్లకిలో ఊరేగించిన అనంతరం స్వామి వారికి రతోత్సవం నిర్వహిస్తారు. స్వామివారి తేరుకు మొక్కుబడిగా పడమటి కోడిపల్లి,ఎరడికెర వాసులు గజమాలలతో స్వామివారి రతోత్సవంను అలంకరిస్తారు రతోత్సవంను గ్రామ ప్రజలు భక్తిశ్రద్దలతో నిర్వహిస్తారు.

## ప్రపంచ శాంతి కోసం రన్‌ఫర్ జీసస్




ప్రపంచ శాంతి కోసం రణ్‌ఫర్ జీసస్ నిర్వహిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం టౌన్, మార్చి 3 ప్రభాతవార్త**

ప్రపంచ శాంతి కోసం రన్-ఫర్ జీసస్ మార్చి 30 శనివారం ఉదయం 6:30 గంటలకు జరుగు 2024ను జయప్రదం చేయండి ఈ రోజు జరిగిన సమావేశంలో ప్రతిష్టాత్మకంగా జరుపబడేరన్ ఫర్ జీసెస్ కార్యక్రమం వినూత్నమైన సువార్త ర్యాలీ జయప్రదం చేయాలని ప్రపంచశాంతి, యేసు క్రీస్తు పునరుర్థసుడైన సందర్బంగా ఆరాధన టివి ఛానల్ వారు తలపతిన కార్యక్రమం జయప్రదం చేయాలని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ చల్లా కిషోర్ చౌదరి కోరారు. ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీ, ఫ్లాగ్స్, గోడపత్రికలు విడుదల చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చర్చ్ కమిటీ అధ్యక్షులు చల్లా రాజశేఖర్‌చౌదరి, రోజ్లీ రాజేస్, జోసెఫ్‌కిశోర్ ఆర్డర్‌బాబు,పాస్టర్ ఎ యేసయ్య, జాన్సన్‌బాబు పాల్, జేమ్స్‌నాయక్, జాన్‌బాబు,ప్రవీణ్, దేవరాజు,రూబెన్, బసవరాజ్, సునీల్ ప్రసాద్‌రావు, రావుస్వరూప్, మరీస్టాన్ పాల్, ఓబయ్య, అజర్య, రవి కుమార్, వినోద్, రూపేష్, జ్ఞాన,శాంతి భాగ్య, సెలిన్ చౌదరి ప్రెస్కిల్లా, విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

## గుండ్లపల్లిలో బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

**బెలుగుప్ప, మార్చి 26 ప్రభాతవార్త**



పథకాల గురించి వివరిస్తున్న తెలుగుదేశం పార్టీ బిసి కార్యదర్శి మల్లికార్జున

బెలుగుప్ప మండల పరిధిలో గుండ్లపల్లి గ్రామంలో బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రామన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా బిసి కార్యదర్శి మల్లికార్జున, మాజీ సర్పంచు శివప్పలు హాజరైనారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మల్లికార్జున మాట్లాడుతూ.. జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గంలో నిలబడిన పయ్యావుల కేశవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పయ్యావుల కేశవ్ గెలిస్తే, 2024లో మంత్రిగా చంద్రబాబునాయుడు ఏర్పాటు చేస్తారని మన మస్యలను కూడా ఆయన తీరుస్తారని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామాంజినేయులు, మాజీ సర్పంచు రమేష్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

**గుడిబండ, మార్చి 26 ప్రభాతవార్త**

గుడిబండ మండల కేంద్రంలో స్థానిక సర్పంచు కరుణాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచు కరుణాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. మండల కేంద్రానికి వివిధ రకాల పనుల నిమిత్తం నిత్యం వేలాది మంది వస్తుంటారని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి నాగారాజు నాయక్, జూనియర్ అసిస్టెంట్ యోగానంద్, గిరిధర్, కదురప్ప, ప్యారాజాన్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

# ఉరవకొండలో భారీ అగ్నిప్రమాదం..!

### - రెండు దుకాణాలు, హోటల్ దగ్ధమై రూ.10 లక్షల వరకు ఆస్తినష్టం

-మంగళవారం తెల్లవారుజామున ప్రైవేటు బస్టాండులో ప్రమాదం -సకాలంలో స్పందించి ఆస్తినష్టాన్ని తగ్గించిన అగ్నిమాపకశాఖ



అగ్నిప్రమాదంలో కాలిపోయిన రెండు దుకాణాల దృశ్యం



ప్రమాదంలో దెబ్బతిన్న హోటల్

**ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త**

ఉరవకొండ పట్టణంలోని ప్రైవేటు బస్టాండులో మంగళవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించగా రెండు దుకాణాలు పూర్తిగా కాలిపోగా, ఒక భోజన హోటల్ పాక్షికంగా దెబ్బతినగా 10 లక్షల రూపాయల వరకు ఆస్తినష్టం సంభవించింది. రాత్రి ఒంటి గంట సమయంలో బస్టాండులోని ఒక లేడీస్ కార్నర్ దకాణం నుండి ఉన్నఫలంగా మంటలు చెలరేగి పక్కన ఉన్న జనరల్ స్టోర్, వెనుకాల ఉన్న భోజన హోటల్‌కు పాకినట్లు తెలుస్తోంది. దీంతో రెండు దుకాణాలు పూర్తిగా దగ్ధంకాగా హోటల్ వెనుకభాగం దెబ్బతిని పైకప్పు కూలిపోయింది. దీంతో లేడీస్ కార్నర్ దుకాణం యజమానికి గందోడి బాబుకు దాదాపు 4 లక్షల రూపాయల వరకు, పక్కనగల జనరల్ స్టోర్ నిర్వాహకుడు ఎర్రిస్వామికు 3 లక్షల రూపాయలు, వెనుకాలగల హోటల్ నిర్వాహకుడు శ్రీనివాసులుకు 3 లక్షల రూపాయల వరకు ఆస్తినష్టం జరిగింది. లేడీస్ కార్నర్ దుకాణం వెనుకవైపు నుండి మంటలు ఎగసిపడటంతో బస్టాండు ప్రాంతంలోనే నిదురించే ఒక హమాలీ విషయాన్ని గమనించి అగ్నిమాపకశాఖకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. దీంతో అగ్నిమాపకశాఖ అధికారి భీమలింగయ్య సిబ్బందితో కూడిన అగ్నిమాపక వాహనం ఘటనా స్థలానికి చేరుకొని గంటపాటు శ్రమించి మంటలు చుట్టుప్రక్కల దుకాణాలకు వ్యాపించకుండా నివారించింది. కాగా అగ్నిప్రమాదానికి వాస్తవ కారణాలు తెలియరాకపోగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి ఉంటుందని అనుమానిస్తున్నారు. కాగా ప్రమాదంలో దుకాణాలు పూర్తిగా కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయిన బాధితులు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకొంటున్నారు.

## ఎన్డీఏ కూటమికు మద్దతు తెలిసిప బంజారా గిరిజన సమాఖ్య

-కౌకుంట్లలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను కలిసిన బీజీఎస్ నాయకులు



ఎన్డీఏ కూటమికి మద్దతు తెలుపుతున్న బంజారా నాయకులతో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త**

బంజారా గిరిజన సమాఖ్య (బీజీఎస్) సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించింది. మండల పరిధిలోని పెద్ద కౌకుంట్ల గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను ఆయన స్వగృహంలో కలిసిన బీజీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.కె.మహేష్‌నాయక్ తదితరులు ఆయనకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఎన్డీఏ అభ్యర్థుల గెలుపుకై కృషి చేస్తామన్నారు. దీంతో ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజీఎస్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## జోరుగా వైసిపి ఎన్నికల ప్రచారం

**కంబదూరు,మార్చి 26,ప్రభాతవార్త**

కంబదూరు మండల కేంద్రంలో మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది.ఈ సందర్బంగా జిల్లా ఎంపి కళ్యాణదుర్గం వైఎస్సార్‌సిపి ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య,అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకర నారాయణ,జిల్లా పార్టీ అధ్యక్షులు పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలసి గ్రామంలోని ప్రతి గడప గడపకు తిరుగుతూ సీఎం జగన్ హయాంలో వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గూర్చి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.అంతక మునుపు వైసిపి శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికారు.వచ్చే 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్య మంత్రిని చేయాలని ఓటర్లను అభ్యర్థించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఏపీలో సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం జగన్ రాష్ట్రానికి చాలా అవసరమని పేర్కొన్నారు.సీఎం జగన:మోహన్‌రెడ్డి హయాంలో విద్య,వైద్య రంగాలు అభివృద్ధి చెందాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కంబదూరులో టిడిపి ఎన్నికల ప్రచారం

**కంబదూరు,మార్చి 26,ప్రభాతవార్త**

కంబదూరు మండల కేంద్రంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది.కళ్యాణదుర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న అమిలినేని సురేంద్ర బాబుకు మద్దతు ఇవ్వాలని ఆయన కుటుంబ సభ్యులు భార్య రమాదేవి,సోదరి రాధ మాధవి,కోడలు ఇషిత,సోదరుడు ఏర్రిస్వామి ఇంటింటికి తిరుగుతూ టిడిపి తలపెట్టబోయే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఏపికి చంద్రబాబు ముఖ్య మంత్రి అయితే అన్ని రకాల అభివృద్ధి జరుగుతుందని వారన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో తాగునీటి కేంద్రం ప్రారంభం



జిల్లా భారతీయ కుటుంబ యోజనా సంఘం ఆవరణలో చల్లటి తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించిన ఎఫ్‌పీఏ అధ్యక్షుడు టి.జి.విఠల్ తదితరులు

**బళ్లారి, మార్చి26, ప్రభాతవార్త**

నగరంలోని భారతీయ కుటుంబ యోజనా సంఘం ఎఫ్‌పీఏఐ ఆస్పత్రిలో చల్లటి తాగునీటి వ్యవస్థను గర్భిణీ మహిళలకు వారి వెంట వచ్చిన కుటుంబాలకు దాహార్థి తీర్చేందుకు ఈ చల్లటి తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించినట్లు సంస్థ అధ్యక్షుడు టి.జి.విఠల్ తెలిపారు. నగరంలోని భద్ర ఆగ్రో సర్వీస్ యజమాని అనిల్‌కుమార్ రెడ్డి ఈ కోల్డ్ ట్యాప్ యంత్రాన్ని దానంగా అందజేసినట్లు, ఆయనే ఈ సౌలభ్యానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. బళ్లారి ఎఫ్‌పీఏఐ శాఖ 50 సంవత్సరాలుగా సేవలందిస్తున్నదని, ఈ సందర్భంలో సార్వనికులకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రసవాలు, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల కొరకు వచ్చే నిరుపేద మహిళల అనుకూలం కొరకు ఈ చల్లటి తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఈ సందర్భంలో ఉపాధ్యక్షులు డాక్టర్ కమ్మ చందన్, ఎస్.విజయసింహా, డాక్టర్ భాగ్య, మేనేజర్ విజయలక్ష్మి, సభ్యుడు విష్ణు, సీనియర్ పాత్రికేయుడు ఎం.అహిరాజ్‌లు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో అక్రమాల నియంత్రణకు సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయండి

- సార్వజనికులకు జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా విజ్ఞప్తి



జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

**బళ్లారి, మార్చి26, ప్రభాతవార్త**

లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు న్యాయ సమ్మతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేందుకు సార్వజనికుల పాత్ర అత్య అమూల్యమయ్యిందని, అదేవిధంగా ఎన్నికల్లో అక్రమాలను నియంత్రించేందుకు భారత ఎన్నికల కమిషన్ సి-విజిల్ మొబైల్ యాప్‌ను ప్రారంభించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. ఇటీవలి రోజుల్లో అందరి వద్ద స్మార్ట్ ఫోన్ ఉండడం సహజమే. సి-విజిల్‌తో స్మార్ట్ ఫోన్ నుంచి నేరుగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి నేరుగా తనకు రిపోర్టు చేయవచ్చునని, ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురిగాకుండా అనుమతి లేకుండా ప్రచారాలు, ప్రభుత్వ స్థలాల దుర్వినియోగం తదితర అక్రమ సభలు, సమావేశాలు జరుగుతుంటే సి-విజల్ ద్వారా తనకు తెలపవచ్చునని తెలిపారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా సి-విజిల్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మీరు సాక్షిగా ఉన్న ఏదేని ఎన్నికల సంబంధిత ఉల్లంఘనల ఫోటోలు, వీడియోలు షూట్ చేసి మీ రిపోర్టును అప్లికేషన్ ద్వారా అప్‌లోడ్ చేసి ఘటన, స్థలం వివరాలు నమోదు చేసి రిపోర్టును చర్య కోసం సంబంధిత అధికారులకు తక్షణమే పంపవచ్చునని చెప్పారు. వంద నిమిషాల వ్యవధిలో ప్రజల ఫిర్యాదులకు సమాధానం లభిస్తుందని, యాప్‌లో నమోదు చేసిన ఫిర్యాదుల గురించి జిల్లాస్థాయి సి-విజిల్ నోడల్ అధికారులు చర్య తీసుకుంటారన్నారు. సార్వజనికుల ఫిర్యాదులకు వంద నిమిషాల వ్యవధిలో అధికారుల నుంచి స్పందన లభిస్తుంది. దీంతో అభ్యర్థులు, కార్యకర్తలు ఓటర్లకు అక్రమంగా పంపిణి చేసే కానుకల దృశ్యాలు సాక్ష్యాల సమేతంగా నమోదవుతాయని చెప్పారు. జిల్లా కంట్రోల్ రూమ్‌కు అప్‌లోడ్ చేసిన దృశ్యాలు జీపీఎస్ సమాచారంతో స్థలాన్ని ధ్రువీకరణ చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నిమిషాల వ్యవధిలో సంబంధిత స్థలానికి పంపేందుకు వీలవుతుందన్నారు. జిల్లాధికారి కార్యాలయం ఆవరణలో ఇప్పటికే కంట్రోల్ రూమ్, సి-విజిల్ బృందాలు పని చేస్తాయని తెలిపారు. ఇప్పటివరకు 37 ఫిర్యాదులు సి-విజిల్ ద్వారా దాఖలైనట్లు, 19 కేసులు పరిష్కృతమైనట్లు చెప్పారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు, వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఎన్నికలు ముగిసేంతవరకు మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు ఎన్నికల సిబ్బంది కార్యం నిర్వహిస్తారని జిల్లా సి-విజిల్ నోడల్ అధికారి షకీనా తెలిపారు.

## 28న బళ్లారి మేయర్ ఎన్నికలు

- రేసులో ముగ్గురు అభ్యర్థులు..... కుదరని ఏకాభిప్రాయం.... ఎన్నిక వాయిదా పడే అవకాశం



బళ్లారి మహానగరపాలికె కార్యాలయం

**బళ్లారి, మార్చి26, ప్రభాతవార్త**

బళ్లారి మహానగరపాలికె మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు ఈనెల 28వ తేదీన జరగాల్సి ఉంది. పాలకపక్షమైన కాంగ్రెస్‌లో మేయర్ అభ్యర్థి ఎవరనే విషయమై ఇంతవరకు తేలకపోవడంతో ఎన్నికలు కాస్త వాయిదా పడే అవకాశం లేకపోలేదు. కలబుర్గి ప్రాంతీయ కమిషనర్ ఈనెల 28వ తేదీన మేయర్ ఎన్నికలు జరపాలని సభ్యులకు నోటీసులు జారీ చేశారు. మేయర్ పదవి ఆకాంక్షిస్తూ సభ్యులు ముల్లంగి నందీశ్, పి.గాదెప్ప, ఎం.ప్రభంజన్‌కుమార్‌లు తమతమ నాయకులతో పలుమార్లు సంప్రదింపులు జరిపారు. వీరందరూ సభ్యుల ఇళ్ల వద్దకు వెళ్లి తమకు మద్దతునివ్వాలని కోరడం జరిగింది. అయితే పార్టీ నాయకులు మేయర్ ఎన్నికకు సంబంధించి ఎటువంటి చర్చ జరపలేదన్నది సమాచారం. ప్రస్తుతం లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం మేయర్ ఎన్నికలు జరిగితే మేయర్ కావాలని ఆశిస్తున్న ఇతర అభ్యర్థుల్లో అసంతృప్తి నెలకని ఎంపీ ఎన్నికలపై పరిణామం పడొచ్చన్న సందేహం పార్టీ నాయకుల్లో తలెత్తింది. ఈ కారణంగా ఎన్నికలు వాయిదా వేయడమే మంచిదని అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను మేయర్ ఎన్నికలు వాయిదా వేసేందుకు ప్రాంతీయ కమిషనర్‌కు సూచించాలని తెలిపినట్లు తెలియవచ్చింది. లోక్‌సభ ఎన్నికలు పోలింగ్ మే 7వ తేదీన జరిగిన అనంతరం మేయర్ ఎన్నికలు జరిగేందుకు సూచన చేయాలన్న తలంపుతో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల తేదీ ప్రకటించిన నేపథ్యంలో గురువారం నాడు ఎన్నికల వాయిదా వేసేందుకు ప్రాంతీయ కమిషనర్ ముందుకు రాకపోతే పాలికె సభ్యులు ఎన్నికల్లో పాల్గొనకుండా అడ్డుకుని కోరం కొరత సృష్టించి ఎన్నికలు వాయిదా వేసే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది.

### పక్షం రోజుల్లోపు రుణ బకాయిలు చెల్లించకుంటే

## ఆస్తులు జప్తు చేస్తాం..!

-విలేఖరుల సమావేశంలో టౌన్ బ్యాంకు అధ్యక్షుడు చంగల మహేష్



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు అధ్యక్షుడు చంగల మహేష్. చిత్రంలో బ్యాంకు సీఈఓ కె.వేదమూర్తి

**ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త**

ఉరవకొండ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో ఇంటి మీద రుణాలు తీసుకున్న ఖాతాదారులు కంతులు సరిగ్గా కట్టక గడువు మీరిపోయిన వారు డిఫాల్టర్లుగా పరిగణించ బడ్డారని వారు బకాయిలు చెల్లించాలని పత్రికా ప్రకటన కూడా ఇవ్వడం జరిగిందని పక్షం రోజుల్లోపు డప్పు చెల్లించని పక్షంలో ఖాతాదారుల ఆస్తులు, తాకట్టు పెట్టిన ఆస్తులను సర్‌ఫెసి యాక్ట ప్రకారం కోర్టు ద్వారా జప్తు చేయడం జరుగుతుందని బ్యాంకు అధ్యక్షుడు చంగల మహేష్ తెలిపారు. పట్టణంలోని బ్యాంకు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన బ్యాంకు సీఈఓ కె.వేదమూర్తితో కలిసి మాట్లాడారు. రుణ బకాయిలు చెల్లించాలని ఇదివరకే రుణాలు తీసుకున్న వారికి 4 నోటీలు అందించడం జరిగిందని అయినా వారి నుండి ఎలాంటి స్పందన లేదన్నారు. దీంతోనే ఆస్తుల జప్తుకు 24వ తేదీన పత్రికా ప్రకటనను జారీ చేయడం జరిగిందని ప్రకటన వెలువడిన పక్షం రోజుల్లోపు బకాయిలు చెల్లించి వారి ఆస్తి తాకట్టు డాక్యుమెంట్లను తీసుకెళ్లాలన్నారు. లేకపోతే రుణాలు పొందిన ఒక్కొక్క ఖాతాదారుడు దాదాపు 40వేల రూపాయలు అదనంగా చెల్లించాల్సి వస్తుందన్నారు.గత 2023 ఫిబ్రవరి నుండి ఇప్పటివరకు 1.7 కోట్ల రూపాయలను ఖాతాదారుల నుంచి బకాయిలను వసూళు చేయడం జరిగిందన్నారు. ఆ మొత్తంలో రోజుకు 5వేల రూపాయల చొప్పున 1.3 కోట్ల రూపాయలను డిపాజిటర్లకు చెల్లించామని ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాలో 42 లక్షల రూపాయల మొత్తం నిలువ ఉందని బ్యాంకు అధ్యక్షుడు చంగల మహేష్ వివరించారు.

## టీడీపీ హయాంలో జరిగిన అవకతవకలతోనే చేనేత కుటుంబం ఆత్మహత్య..!

-విలేఖరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నాయకులు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నాయకులు

**ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త**

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోవున్న సమయంలో జరిగిన అవకతవకలతోనే కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామంలో చేనేత వర్గానికి చెందిన సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య చేసుకుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో టౌన్ బ్యాంకు అధ్యక్షుడు చంగల మహేష్, మాజీ ఎంపీపీ చందా చంద్రమ్మ, సీనియర్ నాయకులు గట్టు ఎర్రిస్వామి, యం.సి.నాగభూషణ, పార్టీ చేనేత విభాగం పట్టణ కన్వీనర్ కొత్తపల్లి హరి తదితరులు మాట్లాడారు. సుబ్బారావు 2015లో 3 ఎకరాల భూమికి తమ పేరుతో 1బి అడంగల్ కూడా తీసుకున్నారని 2017లో వారిపేర్లు తొలగించి ఇతర పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయబడింది టీడీపీ ప్రభుత్వంలోనేనన్నారు. గత నెలరోజుల నుంచి తన భూమిని అమ్ముకోవడానికి సుబ్బారావు ప్రయత్నం చేయగా రికార్డుల్లో ఇతరుల పేర్లు నమోదై ఉండటంతో తీవ్ర మనస్తాపానికి గురై భార్య, కుమార్తెతో సహా ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య అనంతరం పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మెన్ విజయలక్ష్మి సుబ్బారావు కుమార్తెను కలిసి పరామర్శించి 4 లక్షల రూపాయలు డబ్బును ఇవ్వడమే కాకుండా విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లి సదరు బాలిక విద్యార్హతను బట్టి ఉద్యోగం ఇప్పించడంతోపాటు 2 ఎకరాల వరకు భూమి ఇప్పించేందకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. భూ అవకతవకలు టీడీపీ హయాంలోనే జరిగాయని రికార్డులు చెబుతుంటే ఇవేవీ తెలుసుకోకుండా టీడీపీ ఉరవకొండ చేనేత నాయకులు వైఎస్సార్‌సీపీపై బురద చల్లడం దారుణమన్నారు. ఎన్నికల్లో చేనేతల ఓట్లు రాబట్టుకోవడంకోసం టీడీపీ చౌకబారు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నాయకులు నిమ్మల వెంకటరమణ, వేల్పుల వాసుదేవుడు, సాదు వెంకటస్వామి, బీరే శివ, కాసుల ఆంజినేయప్రసాద్, గిరెప్ప, పుల్లా బొజ్జన్న, అమర్‌నాథ్, శంకర, బాలాజీ, కరూరు వెంకటేష్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రితాత స్వామిను దర్శించుకున్న ఎమ్మెల్యే



ఎర్రితాతస్వామిను దర్శించుకొంటున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త**

మండల పరిధిలోని వై.రాంపురం గ్రామంలో వెలసిన ఎర్రితాత స్వామివారిని మంగళవారం ఎమ్మెల్యే, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ దర్శించుకున్నారు. ఎర్రితాతస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభంకాగా ఆయన ఆలయాన్ని దర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ అర్చకులు, గ్రామస్థులు షాలువాకప్పి సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు.

## వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించండి

-చిన్నముష్టూరులో అవగాహన కార్యక్రమం, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త**

ఎండలో తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడంవల్ల వడదెబ్బ బారిన పడకుండా రక్షించుకోవచ్చని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పావని సూచించారు. మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో మంగళవారం ప్రజలకు వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.యండి.షఫీతో కలిసి జాగ్రత్తలను వివరించారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగవద్దన్నారు. ఎండలో ఎక్కువ సమయం పనిచేయడంవల్ల శరీరంలోని నీరంతా చెమట రూపంలో బయటకు వెళ్లిపోయి శరీరం నిర్జలీకరణకు గురై వడబెద్ద తగులుతుందన్నారు. తీవ్రమైన తలనొప్పి, జ్వరం మగతగా ఉండటం, అధికంగా దాహం వేయడం వంటి లక్షణాలు ఉంటే వడదెబ్బ సోకినట్లు నిర్ధారించుకోవాలన్నారు. ఎండకాలంలో జనం బయటకు వెళ్లాల్సివస్తే కాలికి చెప్పులు ధరించాలని, గొడుగులు వినియోగించాలని, వెంట నీటిని తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, సీహెచ్‌ఓ హిమబిందు, ఏఎన్ఎం హేమలత, సీఓ భగవాన్‌దాస్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది సురేష్, హొన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

**తాడిపత్రిరూరల్, మార్చి 26 ప్రభాతవార్త**

మండలంలోని బందార్లపల్లి, ఇగుడూరు గ్రామాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలను మర్యాదపూర్వకంగా కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపుకు ప్రతి ఒక్కరు శక్తివంచనలేకుండా కృషి చేయాలని ఆయన వారికి సూచించారు. ఎమ్మెల్యే వెంట పలువురు మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.

## ఘనంగా ఫయాజ్‌బాష జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఫయాజ్‌బాష, ఫయాజ్‌బాషను సన్మానిస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, మార్చి 26 ప్రభాతవార్త**

అలుపెరుగని సేవాయోధుడు హీరాపురం ఫయాజ్‌బాష జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక ఫయాజ్‌బాష కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఫయాజ్‌బాష కట్ చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఫయాజ్‌బాష తన ట్రస్ట్ ద్వారా ఎంతో మంది బీదవారికి నిత్యం సాయం చేస్తూ ఆపదలో వున్న వారికి డబ్బు సాయం చేయడంతో పాటు పేదవారికి ఇంటి స్థలాలను ఇప్పించి అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడుతూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆలూరు రవిరెడ్డి, ఆలూరు త్రినాథ్‌రెడ్డి, అగ్గిరప్ప, వినయ్, ఆలూరు ప్రసాద్‌రెడ్డి, చిచ్చా మాబాష, వర్క్‌బోర్డు అధ్యక్షులు వలి, పలువురు అభిమానులు, తదితరులు వున్నారు.

## తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి

-జె.సి అశ్మిత్‌రెడ్డి



జె.సి అశ్మిత్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, మార్చి 26 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సుంకులమ్మపాలెం, తూర్పుపాలెం, గణేష్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల యోగక్షేమాలతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టనున్న మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తేదేపా కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త కదిరి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, జె.సి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన చెక్కభజన పోటీలు



చెక్కభజన చేస్తున్న బృందం

**యాడికి, మార్చి 26 ప్రభాతవార్త**

యాడికి శ్రీశివలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం చెక్కభజన పోటీలను ఏర్పాటు చేశారు. మండలం నుండే కాకుండా ఇతర మండలాల నుండి భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఈ చెక్కభజన పోటీలకు విశేష ఆదరణ లభించింది. పిన్నేపల్లి గ్రామానికి చెందిన చెక్కభజన బృందం (నారాయణస్వామి) వారిచే చెక్కభజన పోటీలు చూపర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, బొంబాయి బ్రదర్ వెంకటనాయుడు, ఆలయ ధర్మకర్త బొంబాయి రామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్చకులపై దాడిని ఖండిస్తున్నాం

**పుట్లూరు, మార్చి 26 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

కాకినాడలో అర్చకులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి మండల అధ్యక్షులు రాగేని రామాంజియాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో అర్చకులతో పూజలు నిర్వహిస్తూ వుంటారని పూజలు సరిగా చేయలేదని దాడి చేయడం సమంజసం కాదన్నారు. అర్చకులు భగవత్ స్వరూపులుగా నమ్ముతారని కానీ ఇలా దాడులు చేయడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## సామాజిక ఫించన్లు 3వతేదీ నుండి పంపిణీ

**యాడికి, మార్చి 26 ప్రభాతవార్త**

ఏప్రిల్ నెలకు సంబంధించి సామాజిక ఫించన్లను మండల వ్యాప్తంగా 3వతేదీ నుండి పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఓ సావిత్రి తెలిపారు. మంగళవారం ఎంపిడిఓ సమావేశపు భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో వున్నందున ఎన్నికల అధికారుల నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని నియమాలకు లోబడి ఆయా పార్టీలు వ్యవహరించాలన్నారు. సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపిడిఓ కోరారు.

## మీ ఆశీస్సులతో గెలిపించండి

-తోడుగా ఉంటా..అభివృద్ధి చేసి చూపిస్తా

-శింగనమల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు



ప్రచారంలో పాల్గొన్న వీరాంజనేయులు

**పుట్లూరు, మార్చి 26 ప్రభాతవార్త**

శింగనమల నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో వుంటానని ఎన్నికల్లో తనను ఆశీర్వదించి అఖండ మెజార్టీతో గెలిపించాలని, అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని శింగనమల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం. వీరాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని మడుగుపల్లి, జంగంరెడ్డిపల్లి, వెల్లుట్ల గ్రామాల్లో మన ఊరికి మన వీర కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ గడపగడపకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి జరగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్న గెలుపొందాలన్నారు. జగనన్న ప్రజల కోసం శ్రమిస్తున్నారని మనందరం కూడా ఆయనను రానున్న ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేసి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి, వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కేశఖండన కార్యక్రమానికి జె.సి ప్రభాకర్‌రెడ్డి హాజరు



కార్యక్రమంలో పాల్గొన్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రిరూరల్, మార్చి 26 ప్రభాతవార్త**

మండలంలోని ఇగుడూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కనకం గంగరాజు సోదరుడు కనకం నాగేంద్ర, కనకం భవాని దంపతుల కుమారుడు కనకం శశాంక్ కేశఖండన కార్యక్రమానికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జె.సి ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్దకు రాగానే వారు బాణసంచా పేల్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జె.సి కార్యక్రమంలో పాల్గొని కనకం గంగరాజు ఫ్యామిలీతో కొంతసేపు ముచ్చటించారు. అలాగే ఏర్పాటు చేసిన విందులో జె.సి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. జె.సి వెంట పలువురు టిడిపి నాయ కులు, కార్యకర్తలు వున్నారు. ఈ కార్యక్రమంలో కనకం వెంకటరమణ పాల్గొన్నారు.

## ఉల్లాసంగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలం పోటీలను ప్రారంభిస్తున్న బొంబాయి రమేష్‌నాయుడు



నగదు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

**యాడికి, మార్చి 26 ప్రభాతవార్త**

యాడికి శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వృషభరాజములచే రాతిదూలం లాగుడు పోటీలను ఘనంగా నిర్వాహించారు. ఈ పోటీల్లో మొత్తం నాలుగు కాండ్లు పాల్గొనగా ఇందులో ప్రథమ బహుమతి పిఆర్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు వృషభాలు 931 అడుగులు లాగాయి. దాత నాగరాజు బ్రదర్స్ గోదావరి కన్‌స్ట్రక్షన్స్ 60 వేల రూపాయల నగదు అందచేశారు. ద్వితీయ బహుమతి తాడిపత్రి పట్టణానికి చెందిన రమేష్‌బాబు వృషభాలు 900 అడుగులు లాగాయి. దాత ఉమ్మడి పాల ప్రభాకర్‌రెడ్డి 40 వేల రూపాయలు అందచేశారు. మూడవ బహుమతి పిఆర్‌పల్లి గ్రామానికి చెందిన నాగయ్య వృషభాలు 505 అడుగులు లాగాయి. దాత పెద్దకంబగిరిస్వామి ఎర్రగుడి పెద్దయ్య 30 వేల రూపాయలను అందచేశారు. అప్పేచెర్ల గ్రామానికి చెందిన గోవిందు వృషభాలు 400 అడుగులు లాగాయి. దాత కోటి చిన్నవెంకటరాముడు యాడికి ఎంపిటిసి సభ్యులు 5 వేల రూపాయలు అందచేశారు. ఈ రాతిదూలం లాగుడు పోటీలను చూడడానికి వివిధ మండలాల నుండి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. హాజరైన వారికి వివిధ స్వచ్ఛంధ సంస్థల వారు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## రాయలచెరువులో ఇఫ్తార్ విందు

**యాడికి, మార్చి 26 ప్రభాతవార్త**



ముస్లిం సోదరులకు భోజనం వడ్డిస్తున్న సివి ప్రణయ్‌రెడ్డి

పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని మండలంలోని రాయల చెరువు గ్రామంలోని సివిఆర్ కాలనీలో ప్రముఖ పారిశ్రామికవేత్త సివి రమణారెడ్డి, సివి ప్రణయ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. రాయల చెరువులోని జామియా మసీదు, మక్కా మసీదు లోని ముస్లిం సోదరుల తో పాటు గ్రామంలో వున్న ముస్లిం సోదరీ మణులకు కూడా ఈ ఇఫ్తార్‌విందు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## తెలుగుదేశంలోకి 100 కుటుంబాలు చేరిక



పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న వైకాపా నాయకులు

**నల్లమాడ మార్చి 26 ప్రభాతవార్త**

మండల కేంద్రం నల్లమాడలో మంగళవారం వేళ్ళమద్ది, కొండకిందతాండ, రెడ్డిపల్లి, నల్లమాడ పంచాయితీల చెందిన వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాదాపు 100కుటుంబాలు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు విసిగిపోయామని తెలుగుదేశం పార్టీలో తమకు సరైన న్యాయం దక్కుతుందని, పల్లె రఘునాథరెడ్డి మీద నమ్మకంతో తెలుగుదేశం పార్టీ చేరుతున్నట్లు తెలియజేశారు. అదే విధంగా రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు అమలు, రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే ఒక్క చంద్రబాబు నాయు డితో సాధ్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో వైకాపా సీనియర్ నాయకుడు మట్టా రాజశేఖర్‌తో పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి జనసేన పార్టీ ఇంచార్జ్ పత్తి చంద్రశేఖర్, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మైలేశంకర, మాజీ ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, కేశవరెడ్డి, సలాంఖాన్, బుట్టినాగభూషణం నాయుడు, ప్రసాద్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాబావలి, మైలేరామచంద్ర పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలతో పూల శ్రీనివాసరెడ్డి సమావేశం



ప్రజలతో సమావేశం ఏర్పాటుచేసిన పూల శ్రీనివాసరెడ్డి

**తనకల్లు, మార్చి 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కొక్కంటిక్రాస్ నందు శివసాయి కొండ కళ్యాణమండపం నందు మంగళవారం గ్రామ ప్రజలతో రాష్ట్ర సిఈసి సభ్యులు పూలశ్రీనివాసరెడ్డి సమావేశం నిర్వహించి మండలం యొక్క స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అభ్యర్థి మక్బుల్ అహ్మద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని, ప్రతి ఒక్కరూ సైనికులుగా పనిచేసి మనలో మనకు తేడాలు లేకుండా మన కర్తవ్యాన్ని మనకు కాపాడుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవ్వా.. చంద్రబాబుకు ఓటేస్తే

## పెన్షన్ ఇంటికే పంపిస్తాం

- టిడిపి యువనేత యశ్వంత్ చౌదరి

**కళ్యాణదుర్గం, మార్చి 16 ప్రభాతవార్త**



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సురేంద్రబాబు తనయుడు యశ్వంత్ చౌదరి

అవ్వా.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రతినెలా పెన్షన్‌ను రూ. 4వేలను మీ ఇంటికే వచ్చి అందజేసే ఏర్పాటు చేస్తామని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని కళ్యాణదుర్గం టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తనయుడు టిడిపి యువనేత యశ్వంత్ చౌదరి పేర్కొన్నారు. శెట్టూరు మండల రోడ్‌షో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఐదుకల్లు గ్రామంలో యువనేత యశ్వంత్ చౌదరి వయోవృద్దురాలిని పలకరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే వృద్దులు మరింత సౌకర్యంగా ఉండేందుకు చంద్రబాబునాయుడు ప్రస్తుతం ఉన్న రూ3వేల పెన్షన్‌ను రూ. 4వేలకు పెంచి ఇంటి వద్దకే అందజేసే ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా పేదరిక నిర్మూలను టిడిపి అనేక పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ఎలాగైనా టిడిపికి ఓటు వేసి సహకరించాలని విజ్ఞప్తి చేసారు.

**చిరు వ్యాపారులతో ముచ్చటించిన అమిలినేని యశ్వంత్..**



చిరు వ్యాపారులతో మాట్లాడుతూ అమిలినేని సురేంద్రబాబు

నేడు ఉదయపు నడకకు వెళ్లిన కళ్యాణదుర్గం టిడిపి, జనసేన, టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తనయుడు అమిలినేని యశ్వంత్, రోడ్డుకిరువైపులా ఆకుకూరలు, చేపలు, బట్టలు వ్యాపారాలు చేసుకుంటున్న వారిని పలకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిరువ్యాపారులకు తగిన సౌకర్యాలు కల్పించి వారిని అన్ని రకాలుగా అందుకుంటామని తెలిపారు.

## చలివేంద్రం ఏర్పాటు




చలివేంద్రం ద్వారా ప్రయాణీకురాలికి నీటిని అందిస్తున్న డీయం బాలాజీ దయాల్

**ఉరవకొండ, మార్చి 26 ప్రభాతవార్త**

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఆర్టీసీ ఉరవకొండ డిపో ఆధ్వర్యంలో నీటి చలివేంద్రం ఏర్పాటైంది. ఉదయం నీటి చలివేంద్రాన్ని సిబ్బందితో కలిసి డిపో మేనేజర్ బాలాజీ దయాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీయం బాలాజీ దయాల్ మాట్లాడుతూ వేసవి ఎండల దృష్ట్యా ఆర్టీసీ ప్రయాణీకులు, స్థానిక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో నీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రయాణీకులు, ప్రజలు నీటి చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణం కోసం విరాళం

**నంబులపూలకుంట, మార్చి 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని నడిమిబోడికొండ వద్ద త్వరలో నిర్మితమవుతున్న వైకుంఠ నారాయణస్వామి దేవస్థానం నిర్మాణంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తాధులు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలనే ఉద్దేశ్యంతో వైకుంఠ నారాయణస్వామి సేవాసమితి ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అందరూ ప్రతి ఒక్క ఇంటికి వెళ్ళి విరాళం సేకరిస్తున్నారు. కులం, మతం, వర్గం అనే తేడా లేకుండా భక్తాధులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయ నిర్మాణం కొరకు విరాళం సేకరించాలని మండల ప్రజలు కోరడం జరిగింది. మండల కేంద్రంలో వైకుంట నారాయణస్వామి దేవాలయ నిర్మాణం కొరకు మీరు కూడా భాగస్వాముల్చ కావాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామని వైకుంఠ నారాయణస్వామి సేవా కమిటీ ట్రస్ట్ వారు కోరారు.

## వైసిపి పార్టీ విజయానికి కృషి చేద్దాం

-జెడ్పిటిసి బసిరెడ్డి అనిత విశ్వనాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి

**నల్లచెరువు, మార్చి 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని వైసిపి పార్టీ కార్యాలయం నందు మంగళవారం మండల జెడ్పిటిసి అనితమ్మ విశ్వనాథరెడ్డి, కన్వీనర్ బట్టి హైదర్‌వలి, మండల వైసిపి నాయకులు, గృహసారథులు, బూత్ కన్వీనర్లుకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న సాధారణ ఎన్నికలలో వైసిపి ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల జెడ్పిటిసి అనిత విశ్వనాథరెడ్డి అన్నారు. జేసిఎస్ కన్వీనర్ సమీవుల్లా మాట్లాడుతూ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రభుత్వం సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి సందర్శించి వివరిస్తూ ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలయేకరి రాష్ట్ర డైరెక్టర్ దశరథనాయుడు, సర్పంచ్ పంఛరత్నమ్మ, ఆలయ కమిటీ చైర్మెన్ భాస్కర్, మాజీ సర్పంచ్ రవికుమార్‌రెడ్డి, మాజీ చైర్మెన్ ఆనంద్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబు సభను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కావాడి ప్రవీణ్‌కుమార్

**తనకల్లు, మార్చి 26, ప్రభాతవార్త:**

కదిరి నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి కందికుంట యశోధమ్మ నాయకత్వంలో పట్టణంలోని ఎస్‌టిఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల నుండి అంబెద్కర్ కూడలి, జ్యోతిరావు పూలే విగ్రహం వరకు ప్రజా ర్యాలీగా వెళ్ళి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు బహింగసభలో పాల్గొనడం జరుగుతుంది. ఈ సందర్భంగా కావాడి ప్రవీణ్‌కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కదిరిలో బహిరంగ సభ ఉంటుందని, కావున మండలంలోని అన్ని గ్రామాల నుండి టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయవలసిందిగా కోరారు. అదేవిధంగా మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల నుండి భారీ ఎత్తున ఈ సభకు నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నేతలు బదారాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్, మాజీ మండల కన్వీనర్ బీగం శంకర్‌నాయుడు, తెలుగుయువత అధ్యక్షులు కావిడి ప్రవీణ్‌కుమార్, తోట సరోజమ్మ, వార్డు మెంబర్ దామోదర్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పిజి మల్లికార్జున, ఓబులేసు, చంద్రప్ప, చిన్నప్పరెడ్డి, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## 10 లీటర్ల నాటుసారా స్వాధీనం



నాటుసారాను స్వాధీనం చేసుకున్న ఎస్సై కెయం లింగన్న

**నల్లచెరువు, మార్చి 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఉబిచెర్ల గ్రామ పంచాయతీలోని నల్లజోడు వారిపల్లి గ్రామ సమీపంలో నడింపల్లి గ్రామ సమీపంలో నాటుసారా కాస్తున్న వారిని ఎస్సై కెయం లింగన్న అరెస్ట్ చేయడం జరిగింది. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా మంగళవారం ఎస్సై కెయం లింగన్న తన సిబ్బందితో కలిసి నడింపల్లి గ్రామ సమీపంలో నాటుసారా కాస్తున్న కుళ్ళాయప్పను అరెస్ట్ చేయడం జరిగింది. నింధితుల నుండి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై కెయం లింగన్న తెలిపారు.

## నివాళులు అర్పించిన పూల శ్రీనివాసరెడ్డి



నివాళులు అర్పిస్తున్న సిఈసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి

**తనకల్లు, మార్చి 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కడపలవాండ్లపల్లికి చెందిన వెంకటశివారెడ్డి తల్లి మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర సిఈసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి వారి స్వగ్రామానికి వెళ్ళి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పూల శ్రీనివాసరెడ్డితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో గ్రామసర్వేయర్ మృతి

**పుట్లూరు, మార్చి 26 ప్రభాతవార్త**



నివాళులు అర్పిస్తున్న తహశీల్దార్

డయాలసిస్ వ్యాధితో బాధపడుతూ కోమటికుంట్ల గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ సర్వేయర్ నారాయణస్వామి మృతి చెందారు. నారాయణ స్వామి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే వారని తోటి సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నారాయణస్వామి మృత దేహానికి తహశీల్దార్ మల్లికార్జున స్వామి, రెవెన్యూ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

